సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకులు డి.మురళీధర్ రెడ్డి

లెనినిజం అజేయం

- కార్పొరేట్ల లబ్ధికే బిజెపి చర్యలు
- లెనిన్ శత వర్ధంతి సభలో కె. ప్రభాకర్ రెడ్డి
- లెనిన్ బాల్యం-జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ

ప్రజాశకి-కర్నూలు కలెక్టరేట్ : కారల్‌మార్క్స్ ఏంగిల్స్ రూపొందించిన మార్క్సిజం సిద్ధాంతాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసిన వ్యక్తి లెనిన్ అని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆ సిద్ధాంతానికి అనుగుణంగానే రష్యాలో సోషలిస్టు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. అందుకే లెనినిజం ఎప్పటికీ అజేయమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో ప్రజాశక్తి బుక్ హౌస్ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. లెనిన్ బాల్యం-జీవిత చరిత్ర పుస్తకాన్ని, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి. నరసింహ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కె.ప్రభాకర్ రెడ్డి, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ బి.శంకర్ శర్మ, ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ వి.లక్ష్మీనారాయణ, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగర మోహన్, రచయిత,కవి వెంకటకృష్ణలు పాల్గొన్నారు. ముందుగా లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభను ఉద్దేశించి కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ లెనిన్ చనిపోయి 100 సంవత్సరాలైనా ఆయన గురించి ఇప్పటికే చర్చించుకుంటున్నామన్నారు. కార్మిక కర్షక ఐక్యత ద్వారా రష్యాలో సోషలిస్టు ప్రభుత్వాన్ని నిర్మించారన్నారు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం చేపట్టడంలో కూడా ఆయన చేసిన కృషి ఎంతో గర్వించదగినదన్నారు. భారతదేశంలో నెహ్రూ ప్రభుత్వం అమలు చేసిన పంచశీల విధానం లెనిన్ విధానమేనని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. రామ మందిర ఆలయ ప్రారంభోత్సవం పేరుతో మతోన్మాదంతో ఔకిక తత్వానికి తూట్లు పొడుస్తుందన్నారు. ఇలాంటి మతతత్వ శక్తుల పోకడలను నియంత్రించి లెనిన్ ఆచరణలో పెట్టిన సిద్ధాంతాన్ని అమలు చేసి సోషలిజాన్ని సాధించేందుకు పూనుకోవాల న్నారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ లెనిన్ చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలన్నారు.ఆయన జీవితంలో అనేక కష్టనష్టాలు, ఎత్తుపల్లాలు కనబడుతాయన్నారు. భారతదేశంలో వామపక్ష ఐక్య ఉద్యమాలకు కార్యచరణ జరిగితే దేశంలో నెలకొన్న అనేక సమస్యలకు పరిష్కారం అవుతాయన్నారు. ఫ్యూడలిజం, క్యాపిటలిజంలకు వ్యతిరేకంగా పోరాడి సోషలిజాన్ని సాధించాలని ఆయన కోరారు. ఇతర వక్తలు మాట్లాడుతూ లెనిన్ జీవితం ఎంతో ఆదర్శనీయమన్నారు. సోషలిస్టు రాజ్య స్థాపనలో ఆయన చేసిన కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. ఆయన నింపిన స్ఫూర్తితో నేటి సమాజం మార్పుకు ప్రతి ఒక్కరూ పూనుకోవాలని కోరారు.సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, ఐలు జిల్లా కార్యదర్శి లక్ష్మన్న , మెడికల్ రెప్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకుల జెఎన్.శేషయ్య ప్రజాశక్తి ఎడిషన్ ఇంచార్జి చంద్రయ్య వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లెనిన్ జీవిత చరిత్ర పుస్తుకాలను ఆవిష్కరిస్తున్న ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ లక్ష్మినారాయణ, డాక్టర్ శంకర్ శర్మ, నరసింహా, వెంకట కృష్ణ, రఘుబాబు, సురేష్

తుది ఓటర్ల జాబితా ప్రచురణ

పరిశీలకులు డి.మురళీధర్ రెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో సోమవారం బూత్ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు తుది ఓటర్ల జాబితా ప్రచురణ జరగాలని ఓటర్ల జాబితా పరిశీలకులు, ఎపిఎంఎస్ ఐడిసి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓటరు తుది జాబితా ప్రచురణపై ఇఆర్ఒ ఎఇఆర్ఒలతో ఓటర్ల జాబితా పరిశీలకులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పాపులేషన్ రేషియో, జెండర్ రేషియో తదితర అంశాల గురించి రోల్ అబ్జర్వర్ ఆరా తీశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అందించిన ఫిర్యాదులు పరిష్కరించారా అని అడిగి తెలుసుకున్నారు. తుది ఓటర్ల జాబితా ప్రచురించినప్పటికీ కూడా అర్హులై మిగిలి ఉన్న ఓటర్లకు తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించడం జరుగుతుందన్నారు. నాలుగు కంటే ఎక్కువ పోలింగ్ స్టేషన్లు ఉన్న అర్బన్, రూరల్ ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకుని రావాలని ఆయన ఇఆర్ఒ, ఎఇఆర్ఒలకు సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ తుది ఓటర్ల జాబితా ప్రచురణకు చర్యలు తీసుకుంటున్నామని పరిశీలకులకు వివరించారు. అన్ని దరఖాస్తులను సరైన రీతిలో డిస్పోజ్ చేయడం జరిగిందని, డిస్పోజ్ చేసిన ప్రతి దరఖాస్తుకు డాక్యుమెంటేషన్ మేంటైన్ చేస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామన్నారు. ఓటర్ల జాబితాలో ఇపి రేషియో, జెండర్ రేషియో పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. జెండర్ రేషియోలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు పాల్గొన్నారు.

గడ్డి తింటూ వినూత్న నిరసన

41 వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : బెదిరింపులకు, నోటీలసుకు భయపడేది లేదని సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు పి.నిర్మల రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం 41వరోజు వినూత్న రీతిలో గడ్డితింటూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు, సాధారణ బీమా ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జంద్యాల రఘుబాబు, ప్రజాశక్తి ఎడిషన్ ఇన్‌ఛార్జి పానుగంటి చంద్రయ్య సంఘీభావం తెలిపారు. లలితమ్మ, పి.నిర్మల మాట్లాడుతూ 41 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల సమస్యలు ఏమాత్రం పట్టని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. సమస్యల పరిష్కారం చేయకుండా జీతాలు పెంచకుండా ఎస్మా చట్టం తీసుకు రావడం, టర్మినేషన్ నోటీసులు ఇస్తామని సోమవారం లోపల మీరు డ్యూటీలకు హాజరు కావాలని సూపర్వైజర్లతో ఒత్తిడి తీసుకురావడం బెదిరించడం కొత్త వారిని నియమిస్తామని చెప్పడం పట్ల వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఒకపక్క సమ్మె నోటీసులు ఇచ్చి సమ్మెలో పాల్గొంటున్న అంగన్వాడీలను ఒత్తిడి చేయడం సరైన పద్ధతి కాదన్నారు. రేపటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రోజుకో జిల్లా రాష్ట్ర కేంద్రంలో సమ్మెలో ఉంటుందని తెలిపారు. ఇలాగే ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే రాబోయే కాలంలో జగన్మోహన్‌రెడ్డి ఇంటికి పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జంద్యాల రఘుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల ఆరోగ్యం కాపాడుటలో అంగన్‌వాడీలు ముందున్నారని చెప్పారు. అలాంటి అంగన్‌వాడీల సమస్యను పరిష్కరించకుండా నాన్చుడు ధోరణితో వ్యవహరించడం సరైంది కాదన్నారు. రైతులు ఏడాదికిపైగా ఎండ, వాన , చలికి భయపకుండా పోరాడి వ్యవసాయ వ్యతిరేక చట్టాలను కేంద్రం వెనక్కుతీసుకునేలా చేశారని గుర్తు చేస్తూ ,మొక్కవోని ధైర్యంతో పోరాడుతున్న అంగన్‌వాడీలకు ఉద్యోగుల సంఘీభావం ఉంటుందని చెప్పారు. అంగన్‌వాడీల పోరాటాన్ని ఆయన అభినందించారు. ఆదివారం నిరవధిక సమ్మెలో నిరవధిక సమ్మె శిబిరంలో ఓర్వకల్లు సెక్టార్ అంగన్వాడీలు దీక్షలలో కూర్చున్నారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి ఎం.చంద్రశేఖర్, సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె.సుధాకరప్ప, ఎస్.మహమ్మద్ రఫీ, అంగన్వాడీలు చౌడేశ్వరి విజయ, రాధా విజయమ్మ భారతి, భాగ్యలక్ష్మి, రాధిక, మహేశ్వరి, అంగన్వాడి టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

కర్నూలు ధర్నా చౌక్‌లో 41 వ రోజు గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

సిపిఎం ఆధ్వర్యంలో లెనిన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

లెనిన్ శతవర్ధంతి సందర్భంగా కర్నూలు నగరంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. సిద్ధాంతవేత్త, కార్య దక్షుడు విఐ. లెనిన్ శతవర్ధంతిని పురస్కరించుకొని కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ సుందరయ్య సర్కిల్ వద్ద సిపిఎం న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో విఐ.లెనిన్ శత వర్ధంతి సభ నిర్వహించారు. సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కె.ప్రభాకర్ రెడ్డి , పి. నిర్మల లు మాట్లాడుతూ జారిస్టు రష్యాను సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్‌గా రూపాంతరం చేయించి, ప్రపంచ చరిత్రలో నూతన శకానికి నాంది పలికిన విప్లవ మేధావి లెనిన్ అని కొనియాడారు. నవంబర్ విప్లవం సోవియేట్ విప్లవం అని ప్రపంచం వేనోళ్ల కీర్తించే రష్యా విప్లవానికి వ్యూహరచన చేయటమే కాదు, విప్లవ అవకాశాలు సృష్టించి, వాటిని చేజిక్కించుకోమని రష్యా కార్మిక వర్గాన్ని ఉత్తేజపరిచిన కలం, గళం, లెనిన్.దోపిడికి వ్యతిరేకంగా పోరాడే ప్రతి గొంతులోనూ అజరామరంగా నిలిచే పేరు ఆయనదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్. రాధాకృష్ణ ,ఎం.నారాయణ మాట్లాడారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు, సి.హెచ్.సాయిబాబా, కె.సుధాకరప్ప,ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రబాకర్, గోవిందు, రమణమూర్తి, జి.యేసు, వి.శంకర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, రాష్ట్ర నాయకులు శిరిషా, నగర కార్యదర్శి హుస్సేన్ బాషా, సిఐటియు ఆటో యూనియన్ నగర అధ్యక్షులు హుస్సేన్ వలి, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు రామకృష్ణ, వేర్‌హౌస్ మాలియూనియన్ కార్యదర్శి ఎం.జయన్న, చెన్నయ్య, నాగరాజు, రాజు, కెవిపియస్ నగరకార్యదర్శి ఎం.బాస్కర్, రోశయ్య పాల్గొన్నారు.

సుందరయ్య సర్కిల్‌లో లెనిన్‌కు నివాళ్లు అర్పిస్తున్న ప్రభాకర్ రెడ్డి, నిర్మల, రాముడు తదితరులు

ఓల్డ్‌సిటీలో ..... ప్రపంచంలో భూతల స్వర్గాన్ని నిర్మించి ప్రజలకు అందించిన మహానేతని విఐ. లెనిన్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి కొనియాడారు. ఓల్డ్‌సిటీ సూర్జిత్ భవన్లో లెనిన్ శత వర్ధంతి ప్రారంభ సభ సిపిఎం నగర నాయకులు విజయ్ అధ్యక్షతన జరిగింది. లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి మాటాడుతూ పెట్టుబడిదారీ సమాజంలో కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి పోరాటం ద్వారా 1917లో కార్మిక రాజ్యాన్ని నిర్మించిన మహానేత వి ఐ లెనిన్ అని కొనియాడారు. సిపిఎం పార్టీ ఓల్డ్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు అబ్దుల్లా, రామకృష్ణ నగర కమిటీ సభ్యులు రెడ్డి పోగు కృష్ణ ,మహమూద్, ఖాజాబాషా ,మల్లికార్జున, రంగస్వామి, జయమ్మ, రసీదాదేశాయ్, మహిళా సంఘం నాయకులు వేణమ్మ మా లక్ష్మి, అమీనా సిపిఎం నగర నాయకులు దాసు, కుమార్, నాగరాజు, సామేలు, సోల్మన్ రాజు, ఈశ్వర్, షేక్షా, మద్దిలేటి, రాజేంద్రబాబు పాల్గొన్నారు.

సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ శతవర్ధంతి సందర్భంగా సదస్సు నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నగర కార్యదర్శి వెంకటస్వామి అధ్యక్షత వహించారు. పిడిఎస్‌యు మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శేషఫణి, న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ మాట్లాడారు.

ఓల్డ్ సిటి సూర్జిత్ భవన్‌లో లెనిన్‌కు నివాళి అర్పిస్తున్న గౌస్ దేశాయ్ , ఎం.రాజశేఖర్ తదితరులు

ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఇళ్ల నిర్మాణాలు త్వరగా ప్రారంభించండి: కాటసాని

మార్కాపురంలో ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

లబ్ధిదారులకు అందజేసిన ఇంటి స్థలాలలో త్వరగా ఇళ్ళ నిర్మాణాలు ప్రారంభించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు మండలం కె.మార్కాపురం గ్రామంలో అర్హులైన 112 మంది లబ్ధిదారులకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఇళ్ళ పట్టాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో గ్రామంలోని మరి కొంత మంది అర్హులైన ప్రజలకు ఇళ్ల పట్టాలను అందిస్తామని హామీ ఇచ్చారు. కల్లూరు మండల తహశీల్దార్ రమేష్ బాబు, ఎంపిడిఒ జివి రమణ మూర్తి ఎంపిపి బోయ శారద, గ్రామ సర్పంచ్ బి ఘన మద్దిలేటి, పెద్దపాడు శ్రీధర్ రెడ్డి, కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ కల్లా వెంకట రమణారెడ్డి, కార్పొరేటర్ దండు లక్ష్మీకాంత్ రెడ్డి, కల్లూరు మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య,ఉలిందకొండ రమణారెడ్డి, ఇంకా పలువురు కల్లూరు మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసేవారిని గెలిపించండి : టిజి భరత్

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

కర్నూలును అభివృద్ధి చేసే నాయకుడిని వచ్చే ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టిజి భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని మౌర్య ఇన్‌లో 6వ వార్డుకు చెందిన యువకుడు షాకీర్ బృందం.. ఫైరోజ్, రజాక్ ఆధ్వర్యంలో వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. టిజి భరత్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. భరత్ మాట్లాడుతూ అభివృద్ధి కావాలంటే తనను గెలిపించాలని కోరారు. స్వార్థపు ఆలోచనలతో తాము రాజకీయాల్లో ఉండటం లేదన్నారు. తన తండ్రి లాగే ప్రజాసేవ చేసేందుకు ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు చెప్పారు. పార్టీలు మారే నాయకులకు విలువ, గుర్తింపు ఉండదని ఆయన సూచించారు. తనను నమ్మి పార్టీలో చేరిన వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. తనను గెలిపిస్తే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టిడిపి నేతలు జహంగీర్ బాషా, ఇబ్రహీం, మెహబూబ్, గౌస్ పాల్గొన్నారు

పట్టపగలు దోపిడీ

-సెన్సార్ కెమెరాల ద్వారా వేసిన ఫైన్ లు రద్దు చేయాలి
-పిపిఎస్‌ఎస్ చర్చావేదికలో వక్తలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆశాస్త్రీయంగా నగరంలో సెన్సార్ కెమెరాలను ఏర్పాటు చేసి ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనదారులకు ఫైన్లు వేసి రూ.కోట్లు దండుకుంటూ పట్టపగలు ప్రభుత్వం దోపిడీ చేస్తుందని పట్టణ పౌరసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బిఎఎస్ కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన చర్చావేదికలో వక్తలు తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు, ప్రజల ఇబ్బందులపై ఫోటో ఎగ్జిబిషన్‌ను రవీంద్రవిద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. చర్చా వేదికకు బిఎస్ఎన్ఎల్ విశ్రాంత నాయకులు యాకోబు అధ్యక్షత వహించారు. పట్టణపౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ. పుల్లారెడ్డి మాట్లాడుతూ మా సంఘం తరపున నెల రోజులుగా వివిధ రకాల పోరాటాలు చేసామన్నారు. పోరాటాల ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో సెన్సార్ కెమెరాలను తొలగించారని, సెన్సార్ కెమెరాలు పెట్టి, సిగ్నల్స్ పెట్టి సాఫీగా ప్రయాణం చేసే వారికి ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. సెన్సార్ కెమెరాల విధానం వల్ల దాదాపు రూ.5 కోట్ల వరకు ప్రజలు ఫైన్ ల రూపంలో కట్టాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షులు విజయకుమార్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది సి.నాగేంద్రనాథ్, అర్బన్ బ్యాంకు చైర్మన్ ఎ. బాలరాజు, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం చైర్మన్ కె.ప్రభాకర్‌రెడ్డి, ప్రైవేటు విద్యాసంస్థల జిల్లా అధ్యక్షులు వాసు దేవయ్యలు మాట్లాడారు. నగరంలో రోడ్ల విస్తరణ చేయకుండా డివైడర్లు పెట్టడం వల్ల చెడ్డ పేరు వస్తుందని అధికారులకు, నాయకులకు తెలిపామన్నారు. ప్రభుత్వం ఆదాయం సమకూర్చుకునేందుకు ఇలాంటి ఫైన్లు వేస్తుందని విమర్శించారు. సెన్సార్ కెమెరా గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని అనుకున్నామని తెలిపారు. మేయర్, ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రాలను ఇవ్వాలని, నగరంలో పెయిడ్ పార్కింగ్ ఉండేలాగా చర్యలు తీసుకోవాలని, ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, ప్రజల్లో అవగాహన కల్పించేంతవరకు సెన్సార్ కెమెరాలను రద్దు చేసే విధంగా విన్నవిద్దామన్నారు. ట్రాఫిక్ అవగాహన సదస్సులు ప్రమాదాలు తగ్గించే విధంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఉన్నతాధికారుల ఇండ్ల దగ్గర కాకుండా ప్రధాన కూడళ్లలో ఉద్యోగం చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు, ఇతర వాహనములు ఫ్రీలెఫ్ట్ ఉండేలా చర్యలు తీసుకొని, ప్రజలు తప్పు చేయకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నగర జనాభా ఆరు లక్షలకు పైగా ఉందని చెప్పారు. ఆర్‌టిఎ, కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించకుండా సెన్సార్ కెమెరాలు పెట్టి ఫైన్లు వేసి పట్టపగలు దోపిడీ చేస్తున్నారన్నారు. పట్టణ పౌరుల అందరి బాధ్యతగా భావించి ప్రజలను ఇబ్బంది కలిగించే ఏ సమస్యనైనా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా పోరాటం చేసే పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకుల కృషి అభినందనీయమని అన్నారు. అవసరమైతే కోర్టును ఆశ్రయించి ఉమ్మడి పోరాటాలు చేయాలని సూచించారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం సభ్యులు నౌషాద్, కళాకారుల సంక్షేమ సంఘం నాయకులు రమణారెడ్డి మాట్లాడారు. ఈ చర్చా వేదికలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర నాయకులు ఎం.నాగరాజు, ఎ. వెంకటేశ్వర్లు, సివి .వర్మ, ఎస్ఆర్ .గౌడ్, ఎన్. మద్దిలేటి, కె. శ్రీనివాసులు, పార్వతయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు, వివిధ కాలనీలో అసోసియేషన్ల నాయకులు, యోగా కేంద్ర సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ల నాయకులు,వివిధవాహనాల నాయకులు పాల్గొన్నారు.

సెన్సాల్ కెమెరాల అక్రమాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న జి.పుల్లయ్య

చర్చావేదికలో మాట్టాడుతున్న విజయకుమార్‌రెడ్డి

వైసిపిని ఓడిస్తేనే అభివృద్ధి : గౌరుచరిత

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

వైసిపి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, రాబోయే ఎన్నికలలో ఆ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తేనే ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టిడిపి పాణ్యం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. ఆదివారం ఆమె స్వగహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఐదేళ్లలో ప్రజల ఆదాయం పెరగలేదన్నారు. ఉద్యోగాలు రాలేదుని, సంక్రాంతి కానుక, క్రిస్ మస్ గిఫ్ట్, రంజాన్ తోఫా ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు నాణ్యమైన మద్యం సరఫరా చేస్తే వైసీపీ ప్రభుత్వం వచ్చాక నాసిరకం మద్యం తాగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. జగన్ మందుబాబులను కూడా మోసం చేశారని అన్నారు. యువత ఉపాధి కోసం బయట ఊళ్లకు వెళ్లి బతకాల్సి వస్తుందన్నారు. వైసీపీ నేతల వేధింపులతో ఎస్సీలు ఆత్మహత్య చేసుకుంటున్నారని, కబ్జా చేసినవారికే న్యాయం చేసే ప్రభుత్వం ఇది అన్నారు. భూరక్షణ చట్టం అమల్లోకి వస్తే మీ భూములు గోవిందా.. గోవిందా అని టీడీపీ వచ్చాక భూరక్షణ చట్టం రద్దు చేస్తామన్నారు. చెల్లికి న్యాయం చేయలేనివారు.. ఇక ప్రజలకేం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డి నాయకులు నాగిరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను పరామర్శించడానికి వెళ్లిన పి.నిర్మలను అరెస్టు చేస్తున్న రెండో పట్టణ పోలీసులు ,పోలీసుల చర్యలను ప్రతిఘటిస్తున్న నిర్మల

అంగన్‌వాడీలు, సిఐటియు నాయకుల అరెస్టు

అక్రమ అరెస్టులను ఖండించిన డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు, నంద్యాల జిల్లాలనుంచి విజయవాడకు బయలు దేరిన అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలను, సిఐటియు నాయకులను ఆయా రైల్వే స్టేషన్లలో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. నంద్యాల జిల్లా బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో జిల్లా అధ్యక్షులు షేభారాణి నాయకత్వంలో విజయవాడలకు బయలు దేరిన 50 మందికిపైగా అంగన్‌వాడీలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కర్నూలు జిల్లా కర్నూలు, ఓర్వకల్లు, దేవనకొండ, కోసిగిలలో వందలాది మంది అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేసి ఆయా పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించారు. కర్నూలు రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో నిర్భందించిన అంగన్‌వాడీలను పరామర్శించడానికి వెళ్లిన అంగన్‌వాడీల గౌరవాధ్యక్షులు పి.నిర్మలను, సిఐటియు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.

జగనన్నకు చెబుదామనే కార్యక్రమానికి వెళ్తున్న అంగన్వాడీ కార్యకర్తలను, కార్మిక సంఘాల నాయకులను అక్రమంగా నిర్బంధించడాన్ని, అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాఘవేంద్ర, వై.నగేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈరోజు మధ్యాహ్నం నుండి వారి హక్కుల కోసం శాంతియుతంగా విజయవాడలో జగనన్నకు చెబుదామనే నిరసన కార్యక్రమానికి వెళ్ళనీయకుండా నిర్బంధించడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి నిర్బంధాలతో ఉద్యమాలని ఆపలేరని తెలిపారు. చివరికి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో అంగన్వాడీ టీచర్లను పలకరించడానికి వెళ్లిన సిఐటియు నాయకులు పి నిర్మల, ఓల్డ్ టౌన్ కార్యదర్శి విజయ్, నగర నాయకులు రఫీ నీ అక్రమంగా నిర్బంధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ కు ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ కంటే అదనంగా జీతం పెంచాలని, కనీస వేతనాలు 26,000 ఇవ్వాలని సమ్మె చేస్తున్నారన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని దీక్షలో ఉన్న కార్మిక సంఘాల నాయకులను అక్రమంగా నిన్న రాత్రి అరెస్టు చేసి దీక్షలు భగ్నం చేశారని తెలిపారు. ఎక్కడికక్కడ అంగన్వాడీ టీచర్లను హెల్పర్లను , సిఐటియు ఇతర కార్మిక సంఘాల నాయకులను పోలీస్ స్టేషన్లో ఇండ్ల దగ్గర నిర్బంధించడాన్ని సమాజంలోని పౌరులందరూ ఖండించాలని డివైఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు.పాలకులకు చిత్తశుద్ధి ఉంటే అక్రమ నిర్భంధాలను ఆపేసి అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను అంగీకరించాలని కోరారు. ఇలాంటి నిర్భంధాలు ప్రయోగిస్తే ఉద్యమాలు పెరుగుతాయని హెచ్చరించారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

- సిఐటియు మండల కార్యదర్శి హెచ్ జయరాజు
- ఛలో విజయవాడ వెళ్తున్న అంగన్వాడీలు అరెస్ట్

ప్రజాశక్తి - మంత్రాలయం

పోలీస్ స్టేషన్లో అంగన్వాడీలు

అంగన్వాడీల అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిఐటియు మండల కార్యదర్శి హెచ్ జయరాజు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు ఉపాధ్యక్షులు భీమేశ్వరిలు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ వేణుగోపాల్ రాజు వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత 41 రోజులుగా సమ్మె చేస్తూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా 22 వ తేదీన చలో విజయవాడ పెట్టిన నేపథ్యంలో ముందస్తు అరెస్టులు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఇలాంటి అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అంగన్వాడీలు మహిళలు అని కూడా చూడకుండా రాత్రి వేళల్లో పోలీసులు అరెస్టులు చేయడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించి అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో అంగన్వాడీలు స్వప్న, ప్రమీల కళ్యాణి స్వేత తదితరులు ఉన్నారు.

తాలుకా అంగన్వాడీ నాయకురాలు జయశ్రీకి నోటీసులు ఇస్తున్న పోలీసులు

ఆలూరు : శాంతియుతంగా అంగన్వాడీ మహిళలు 41 రోజులుగా సమ్మె చేస్తుంటే వారి సమస్యలు పరిష్కరించకుండా అరెస్ట్లు చేయడం ఏమిటని సిపిఎం మండల కన్వీనర్ షాకీర్ ప్రశ్నించారు. మండలంలో తాలుకా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు జయశ్రీని, సిఐటియు నాయకులు కెపి నారాయణ స్వామిని విజయవాడకు వెళకుండ అడ్డుకోవడాని వారు తప్పుబట్టారు. సిఐటియు, అంగన్వాడీ నాయకులను ముందస్తుగా నోటీసులు ఇచ్చి అరెస్ట్ చేయించడం ముఖ్యమంత్రి నీచనీ దిగజారుడు ప్రజల దురదృష్టకరమన్నారు. అత్యధికంగా ఉన్న మహిళా ఓటర్లు ఈ ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. విజయవాడకు ఎక్కడ వెళ్తారో అని ముందస్తు నోటీసులు ఇవ్వడం, అరెస్టులు చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అరెస్టులు కాదు దమ్ముంటే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసారు. ఇలాగే ఉంటే రాష్ట్రంలో శాంతి భద్రతలకు ఆటంకం కలిగించే దానిలో ముఖ్యమంత్రి ముందున్నట్టు భావించాలని, రాష్ట్రంలో జరిగే అన్నింటికీ భాద్యత వహించవలసి వస్తుందని వారు హెచ్చరించారు.

డిమాండ్లను పరిష్కరించకుంటే..
గద్దె దిగాలి

ఆలూరు అంబేద్కర్ సర్కిల్ లో 41 ఆకారంలో కూర్చొని నిరసన తెలిపిన అంగన్వాడీలు

- 41వ రోజు సమ్మెను కొనసాగించిన అంగన్వాడీలు
-మద్దతు తెలిపిన ప్రజా సంఘాల నాయకులు

గద్దె ప్రభుత్వం న్యాయమైన అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించడం చేతకాకపోతే గద్దె దిగాలని అంగన్వాడీలు వర్కర్స్, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. పండగరక.. పట్టుమనస సమ్మె, చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించడమే కాక.. ఎస్మా చట్టం ప్రయోగించి నోటీసులు ఇవ్వడం దారుణమని నాయకులు మండిపడ్డారు. 41వ రోజు సమ్మె, చేస్తున్న అంగన్వాడీలకు వ్యవసాయ, రైతు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. భారీ ర్యాలీలతో అంగన్వాడీలు నిరసనలు తెలిపారు.

ప్రజాశక్తి - ఆదోని

చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న అంగన్వాడీలకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె వెంకటమ్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి రామాంజనేయులు, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పీఎస్ గోపాల్, మండల అధ్యక్షులు రామాంజనేయులు, వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోని అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే దీక్షలు చేపట్టారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్క రించాలన్నారు. ఇచ్చిన హామీలు వదిలేగా అమలు చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీలకు సిపిఎం పెంచేంతవరకు సమ్మెలో కొనసాగుతారని తెలిపారు. అంతకుముందు టూటౌన్ ఎస్ఐ నరసన్న అంగన్వాడీ దీలకు నోటీసులు ఇచ్చారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు రిజ్వాన, సరోజ, గీత, రేణుక, సుజాత, మీనా కుమారి, ఉమా, అంథోనమ్మ, శారద, ఈరమ్మ, ఆదోని ప్రాజెక్ట్ అంగన్వాడి వర్కర్స్, హెల్పర్లు పాల్గొన్నారు. **ఆలూరు :** సిఎం జగన్కు అంగన్వాడీల శక్తి ఎంతో చూపిస్తామని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణస్వామి, ఎపి అంగన్వాడీ వర్కర్స్, హె ల్పర్స్ యూనియన్ నాయకురాలు జయశ్రీ, బాలరంగమ్మ, ప్రభావతి తెలిపారు. అంబేద్కర్ సర్కిల్లో 41ఆకారంలో కూర్చొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళలను 41 రోజులుగా రోడ్లపై కూర్చోబెట్టిన ప్రభుత్వానికి పుట్టగతులుండవన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కృష్ణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు భారతి, లక్ష్మీ,సరస్వతి,సుజాత,వెంకటలక్ష్మి ఆలూరు ప్రాజెక్టు అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు సమ్మెలో పాల్గొన్నారు. **ఆస్పరి :** అంగన్వాడీ సమస్యల పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తోందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మండిపడ్డారు. జీతాలు పెంచాలని లేదంటే గద్దె దింపాలని అంగన్వాడి వర్కర్స్కి సూచించారు. ఆస్పరిలో అంగన్వాడి వర్కర్స్ చేపట్టి నిరవధిక సమ్మెలో వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. జీవో నెంబర్ 2,ఒర్గనైజేషన్ పేరుతో అనేక రకాలుగా భయభ్రాంతులకు గురి చేసి ప్రభుత్వం సమ్మెను నీరుగార్చాలని ప్రయత్నాలు విఫలం అయ్యాయన్నారు. ప్రభుత్వం తాటాకు చప్పుళ్లకు అంగన్వాడీలు భయపడరన్నారు. అంగన్వాడీలకు రైతు సంఘం సంపూర్ణ మద్దతు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు,మండల కార్యదర్శి రంగస్వామి, సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు,ఏఐటియుసి మండల కార్యదర్శి కృష్ణమూర్తి,అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాలు జ్యోతి,విమల, ప్రమీల,రాణి,బేగం,లత,విశాలాక్షి,మారి చిట్టెమ్మ,మంజుల పాల్గొన్నారు. **మంత్రాలయం :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సమ్మెను అంగన్వాడీలు 41వ రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, ఉపాధ్యక్షులు విశాలక్షి, భీమేశ్వరి, లావణ్యలు మాట్లాడారు. ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. **ఎమ్మిగనూరు :** పట్టణంలో అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా ఎమ్మిగనూరు ప్రాజెక్ట్ పరిధిలో 36వేల సంతకాల సేకరణ నిర్వహించారు. అనంతరం సిఐటియు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ, పట్టణ మండల నాయ కులు నాగలక్ష్మి, తెలజ, నీరజ, మల్లీశ్వరి, నాగేశ్వరమ్మ తదితరులు మాట్లాడారు. అంగన్వాడీల సమస్య పరిష్కారం పట్ల ప్రభుత్వ అసమర్థత తేటతెల్లమవుతుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

ఆదోని : నోటీసులతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ఆస్పరి : మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

మంత్రాలయంలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ఎమ్మిగనూరు : నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

శ్రీ మఠంలో కర్నాటక హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - మంత్రాలయం

జడ్జి ఉమకు స్వాగతం పలుకుతున్న శ్రీమఠం అధికారులు

శ్రీ రాఘవేంద్రస్వామిని కర్నాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి శ్రీమతి ఉమ ఆదివారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీ మఠం ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతిఆచార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు వారికి చీర రవికతో పాటు ఫల మంత్రాక్షతలు మెమొంటో అందజేసి ఆశీర్వదించారు. వారికి ఎస్ఐ వేణుగోపాల్ రాజు ఆదేశాల మేరకు ఎఎస్ఐ ఆనంద్ రెడ్డి సిబ్బందితో భద్రత కల్పించారు.

శోభాయాత్రలో భాగస్వాములు కావాలి

- శ్రీ మఠం మేనేజర్ యస్కే శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం

అయోధ్యలో శ్రీరామ మందిరంలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ చేయనున్న నేపథ్యంలో శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు గ్రామంలో శ్రీ రాముని శోభాయాత్ర నిర్వహించబడుతుందని గ్రామ ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని శ్రీ మఠం మేనేజర్ యస్కే శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శ్రీ రామ శోభాయాత్ర శ్రీ మఠం ఆవరణంలో ఉన్న యోగీంద్ర సభామండపంలో నుండి రామలింగేశ్వరస్వామి ఆలయం, శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం మీదుగా రాఘవేంద్ర సర్కిల్ నుంచి ప్రధాన రహదారి నుండి మళ్లీ శ్రీ మఠం చేరుకుంటుందన్నారు.

ఆదోని రైల్వే స్టేషన్లో తనిఖీలు

- రూ. కోటి 95 వేల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని రైల్వే స్టేషన్లో రూ.కోటి 95 వేల 450 రూపాయలను ఆదివారం నాడు రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న భారీ నగదును రైల్వే డిఎస్పి అబ్దుల్ ఆజాజి మీడియాకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడించారు. రైళ్లలో అక్రమంగా మద్యం నగదు బంగారు తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచామని అన్నారు. బంగారు నగదు మద్యం తరలింపు వారి వివరాలను తమకు చేరవేయాలని విజ్ఞప్తి చేశారు. బళ్లారి - రాయచూరు వైపు వెళ్లే రైళ్లలో ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించేందుకు రెండు పోలీసు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. తనిఖీల్లో పోలీసులను డిఎస్పి ప్రత్యేకంగా అభినందించి, ప్రతిభ చూపిన వారికి రివార్డ్ ఇచ్చేలా అధికారులకు నివేదిస్తామన్నారు. రైల్వే ఎస్ఐలు రామస్వామి, గోపాల్, ఆర్పిఎఫ్ ఎస్ఐ లక్ష్మన్న మాట్లాడుతూ ఆదోని రైల్వే స్టేషన్లో తనిఖీ చేస్తుండగా ఆదోని హవన్న పేటకు చెందిన ఖోల్కర్ మహ్మద్ ఆదోనికి రాయలసీమ ఎక్స్ప్రెస్లో వస్తుండగా 1వ ప్లాట్ ఫారంపై అదుపులో తీసుకొని రూ.1,00,95,450 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ఆదాయపు పన్నుల శాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ శర్వేశ్వరరావు, శివ రామయ్య, పిసీలు పరుశురాముడు, శేక్షావలి, మహేంద్ర, లక్ష్మి పాల్గొన్నారు.

వివరాలు వెల్లడించిన రైల్వే డిఎస్పి అబ్దుల్ ఆజాజి

27న అంతర్రాష్ట్ర ఫుట్బాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 27న వైయస్సార్ అంతర్ రాష్ట్ర ఫుట్బాల్ టోర్నమెంట్ ఎమ్మిగనూరు నీలకంటేశ్వర జాతరను పురస్కరించుకొని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ మహమ్మద్ పేర్కొన్నారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కాలేజ్ నందు వైయస్ఆర్ అంతర రాష్ట్ర ఫుట్ బాల్ టోర్నమెంట్ గోడపత్రికలను, కరపత్రాలను ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు ఫుట్ బాల్ అసోసియేషన్ సభ్యులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎర్రకోట

మాట్లాడుతున్న నాయకులు

మోకాళ్లపై నిలబడి క్లాప్ డ్రైవర్ల నిరసన

36వ రోజు సమ్మె

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ క్లాప్ డ్రైవర్లు ఆదివారం మోకాళ్ల పై నిలబడి నిరసన తెలిపారు. క్లాప్ డ్రైవర్ల సమ్మె 36వ రోజుకు చేరింది. మున్సిపల్ క్లాప్ డ్రైవర్లు కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట నిరసనకు ఓల్డ్ సిటీ సిఐటియు నగర నాయకులు డి.కుమార్ అధ్యక్షత వహించారు. సిఐటియు నగర అధ్యక్షులు డి.అబ్దుల్ దేశాయ్ కార్మికులను ఉద్దేశించిమాట్లాడుతూ కార్మికులు గత 36 రోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించక పోవడం దుర్మార్గ మన్నారు. పెండింగ్ లో ఉన్న12 నెలలజీతాలు ఇవ్వాలని, ఇఎస్ఐ పిఎఫ్ అమలు చేయాలని, పని భద్రత కల్పించి, వీక్లీ ఆఫ్లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అగ్రిమెంట్ ప్రకారం రూ.18,500 జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లతో శాంతి యుతంగా సమ్మె చేస్తుంటే అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని, అందరినీ కలుపుకుని సమ్మె ఉధృతం చేస్తామని, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం పైన వ్యతిరేకత పెరిగి త్వరలో రాబోతున్న ఎన్నికల్లో ప్రజలు వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు క్లాప్ డ్రైవర్ యూనియన్ నాయకులు రఘుశేఖర్, నరేష్ నవీన్, బాబ్జి, పరమేష్, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పతనం తప్పదు : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గత 41 రోజులుగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయకుంటే ప్రభుత్వానికి పతనం తప్పదని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్. రాధాకృష్ణ, ఎండి.అంజిబాబులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం కార్మిక కర్షక భవన్ సిఐటియు కార్యాలయం లోజిల్లా కార్యదర్శి వర్గ సమావేశం పిఎస్ .రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. అంజిబాబు, పిఎస్.రాధాకృష్ణ మాట్లాడుతూ అంగన్వాడీలు గత ప్రభుత్వం పెంచిన వేతనాలతోటే వారు కాలాన్ని నెట్టుకొస్తున్నారని, వైసిపి ప్రభుత్వం కేవలం రూ.1000 మాత్రమే పెంచి తానే ఇప్పుడు వస్తున్న జీతం అంత తామే పెంచామన్నట్లు గొప్పలు చెబుతుందన్నారు. చాలీచాలని వేతనాలతో అంగన్వాడీలు కుటుంబాలు లను నెట్టుకొస్తున్నారన్నారు. వారిని గవర్నమెంట్ ఉద్యోగస్తులుగా భావిస్తూ సంక్షేమ పథకాలు నిలిపివేయడం చాలా దారుణమన్నారు. అనేక రకాలుగా సేవలు అందిస్తున్న అంగన్వాడీల పట్ల ప్రభుత్వం చిన్న చూపు తగదని వారన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్వాడీలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని లేదంటే చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వాన్ని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఇవేకాక 11 నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని, క్లాప్ ఆటోడ్రైవర్లు ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అంగన్వాడీలు, క్లాప్ ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు, పి.ఈరన్న, జె.నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, సిహెచ్ సాయి బాబా ,మారెళ్ళ విజయ్, కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

వైసిపితో ఒరిగిందేమి లేదు : బివి

టిడిపి పల్లెనిద్ర పునః ప్రారంభం - పిల్లిగుండ్ల, గోనెగండ్ల గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే బస

ప్రజాశక్తి - గోనెగండ్ల

గ్రామస్తులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బివి

ఒక్క అవకాశం ఇస్తే తమ జీవితాలు మారుతాయోనని వైసిపికి అధికారం ఇస్తే ప్రజలకు ఒరిగిందేమి లేదని ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి అన్నారు. మండలంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం తిరిగి శనివారం నుంచి ప్రారంభ మయ్యింది. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి పిల్లిగుండ్ల గ్రామంలో రాత్రి బస చేసి ఆదివారం ఉదయం ఒంటెడుదిన్నె గ్రామంలో పర్యటించి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మహిళలు గ్రామస్తులతో మాట్లాడారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఒంటెడు దిన్నే గ్రామంలో కోటి రూపా యల నిధులతో సిసి రోడ్లు,డ్రైనేజీ ప్రభుత్వ భవనాల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ ంలో పాఠశాలను బాగు చేయించే పరిస్థితి కూడా లేదని అన్నారు. అనంతరం మండల కేంద్రం చేరుకొని స్థానిక వైఎస్ఆర్ సర్కిల్లో ప్రజలతో మాట్లాడారు. ఈ నాలుగేళ్ల కాలంలో వైయస్సార్ పార్టీ చేసేందేమి లేదన్నారు. గ్రామాల్లో అభివృద్ధి ప్రజలకు సంక్షేమ పథకాలు సజావుగా అందాలంటే రాష్ట్రంలో తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ తెలుగుదేశం పార్టీని బలపరచి తిరిగి ప్రభుత్వం ఏర్పాటు చేసేలా సహకరించాలని కోరారు. అనంతరం నాయి బ్రాహ్మణ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి అక్కడే రాత్రి బస చేశారు. ఈ కార్యక్రమంలో గోనెగండ్ల సర్పంచ్ హైమావతి, టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, తిరుపతయ్య నాయుడు, బేతాళ బడేసాహెబ్, రామాం జనేయులు, కులుమాల రాముడు, శ్రీధర్ నాయుడు, రమేష్ నాయుడు, రంగస్వామి నాయుడు,నూర్ అహమ్మద్,మదీనా,ఫక్రుద్దీన్, మాబు వలి,పిల్లిగుండ్ల జయపాల్, తిప్పారెడ్డి,ఒంటెడుదిన్నె శివన్న,ఉపేంద్ర రెడ్డి,గౌండరహంతుల్లా పూజారి చంద్ర అడ్వకేట్ వెంకటేశ్వర్లు ఐటీడీపీ సోషల్ మీడియా రాంపురం రఫీక్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుంకప్ప తాత ఉరుసు

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలోని నాగలదిన్నే రోడ్డు లో వెలసిన శ్రీ సుంకప్ప తాత (వన్నురస వలి) ఉరుసు మహోత్సవం పీఠాధిపతి ఖాజా హుస్సేన్ తాత ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాను వివిధ రకాల రంగులతో విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. దర్గాను పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించారు. గ్రామ ప్రజలే కాకుండా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉరుసు మహోత్సవానికి వచ్చిన ప్రముఖులను పీఠాధిపతి ఖాజా హుస్సేన్ తాత శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముల్లా సాబ్లు రహమతుల్లా, మౌల, శెక్షావలి, చాంద్ అన్ను, భక్తులు, శిష్యులు పాల్గొన్నారు.

ఓట్లు బహుజనులవి అధికారం సంపన్నులకా.. ? : సిపియుఎస్ఐ

ప్రజాశక్తి - ఆదోని

బహుజన కులాల ప్రజల ఓట్లతో సంపన్న, అగ్రవర్గ కులాలకు అధికారం చెలాయించడం ఏంటని సిపియుఎస్ఐ జాతీయ కార్యదర్శి పగడాల కోదండ, ఆదోని అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు పాండురంగ, బిసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు, బహుజన విద్యార్థి సమైక్య రాష్ట్ర కన్వీనర్ పగడాల రమేష్ ప్రశ్నించారు. ఆదివారం ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ దళిత బహుజన శ్రామిక విముక్తి పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి మారోజు వీరన్న 62వ జయంతి సందర్భంగా ఆదోని బీమాస్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో రాజకీయ పార్టీలు నిరంతరం ఓటర్లను మోసగిస్తూ నోటుతో ఓటును కాజేసుకొని అగ్రకుల ధన స్వామ్యాన్ని కొనసాగిస్తు న్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సి.బొజ్జన్న, వి .హరీష్, సి. నాగ రాజ్, పవన్, కురవ లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28న విమల రీజెన్సీలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో సుమారు 100 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న విమల రీజెన్సీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం విమల రిజెన్సీ ఎండి పవన్ కుమార్ రెడ్డి తదితరులు ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి స్వగృహంలో వైసిపి నాయకుడు జయ మనోజ్ రెడ్డి ఆధ్వర్యంలో బ్రోచర్ విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 28, 29వ తేదీల్లో ఆదోనిలో మెగా జాబ్ మేళాను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాలలో 80 శాతం ఆదోని వారికే ఉంటా యన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విశాఖపట్నం కేంద్రంగా నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ లో పాల్గొని రూ .100 కోట్లకు ఎంఓయు చేసుకోవడం జరిగిందన్నారు. ఆదోనిలో ఈ విమల రీజెన్సీ ఏర్పాటు చేయడం వల్ల ప్రత్యక్షంగా సుమారు 250 మందికి పరోక్షంగా 700 మందికి ఉపాధి లభించడం ఖాయమన్నారు. ప్రత్యక్ష ఉపాధి కోసం జరిగే ఈ మెగా జాబ్ మేళాను జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నత అధికారులు ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఎంపికైన వారికి 45 రోజులపాటు శిక్షణ ఇవ్వడమే కాకుండా వారికి ఐదు నుంచి ఎనిమిది వేల రూపాయలు దాకా అర్హతను బట్టి స్టై ఫండ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం కన్వెన్షన్ సెంటర్, ఐటి నెట్వర్క్ సొల్యూషన్, సూపర్ మార్కెట్ ,ప్లే జోన్, డ్రెస్సింగ్ తదితర రంగాలను విమల రీజెన్సీలో పెడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా నాణ్యమైన పంటల ఉత్పత్తులను వినియోగ దారులకు అందించే విధంగా సూపర్ మార్కెట్ ప్రారం భిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వైకాపా యువజన విభాగం నాయకులు వినోద్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు దేవా, కౌన్సిలర్లు వైజి బాలాజీ, రాజేశ్వర్ రెడ్డి, అశోక్, సీనియర్ నాయకులు స్వామి తదితరులు పాల్గొన్నారు.

హొటల్ నమూనా

ఎఇఒల పదోన్నతులకు ప్రభుత్వం సుముఖత

- ఎఇఒల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డివి వేణుమాధవరావు

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రంలో వ్యవసాయ విస్తరణ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న వారికి పదోన్నతులు కల్పించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని ఎఇఒల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డివి వేణుమాధవరావు తెలిపారు. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై వచ్చిన ఆయనకు మండల ఎఇఒ నరసింహుడు ఆయనకు స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రుని మూల బృందావనాన్ని వారు దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యసాయ విస్తరణ అధికారులకు పదోన్నతులు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జరిగిందని అందువల్ల శుభ వార్తతో శ్రీ గురురాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చినట్లు చెప్పారు. అదే విధంగా పెండింగ్లో అన్ని డిమాండ్స్లు పరిస్కారం చేస్తామని కమిషనర్ తెలిపారన్నారు. ఈ సందర్భంగా వేణుమాధవ రావుకు ఎఇఒ నరసింహుడు శాలువతో సత్కరించి రాఘవేంద్రస్వామి రూపం గల జ్ఞాపికను అందజేసి ఎఇఒల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి సత్యనారాయణ, రాష్ట్ర కోశాధికారి సుభాని ఇతర ఎఇఒ లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎలక్ట్రోల్ అబ్జర్వర్ డి మురళీధర్ రెడ్డి

అంగన్‌వాడీలు అరెస్టు

- నందికొట్కూరులో సిపిఎం, సిఐటియు నాయకులు.. - పోలీస్ స్టేషన్‌లో నిర్బంధం
- అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు - 41వ రోజూ నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - బేతంచర్ల

చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులను, అంగన్‌వాడీ కార్యకర్తలను, ఆయాలను బేతంచెర్ల మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం, బేతంచెర్ల రైల్వే స్టేషన్లలో, ఆర్టీసీ బస్టాండ్‌లలో శనివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.షేఖారాణి, మండల అధ్యక్ష కార్యదర్శులు ఎన్‌కె నాగలక్ష్మి , గుల్జార్ బి, మాణిక్యవీణ, శోభారాణి, శివలక్ష్మి, లక్ష్మీదేవి, సంతోషమ్మ, లక్ష్మి నారాయణమ్మ, విజయమణి, అంజనమ్మ, శివకుమారితో పాటు 50 మందికి పైగా పోలీసులు అరెస్ట్ చేసి బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎపి అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.షేఖారాణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, వైవి.వెంకటేశ్వర్లు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.మధు శేఖర్ మాట్లాడుతూ అంగన్వాడీలను పోలీసులతో అరెస్టు చేయించినంత మాత్రాన ఉద్యమాలను ఆపలేరని, హక్కులు సాధించుకునే తీరుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్వాడీలు గత 41 **మిగతా 6వ పేజీలో...**

బేతంచర్ల పోలీస్ స్టేషన్‌లో అంగన్‌వాడీ నాయకురాళ్లను, అంగన్‌వాడీలను నిర్బంధించిన పోలీసులు

నందికొట్కూరులో సిపిఎం, సిఐటియు నాయకులను పోలీస్ స్టేషన్‌లో ఉంచిన పోలీసులు

నిష్పక్షపాత ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

- నేడు తుది ఓటర్ల జాబితా ప్రచురణ
- ఎలెక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ డి.మురళీధర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాజకీయ పార్టీలు, ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన క్లెయిమ్స్‌ను, ఫిర్యాదులను నిష్పక్షపాతంగా పరిశీలించి ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శక తుది ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఎలెక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్, వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డి.మురళీధర్ రెడ్డి ఈఆర్ఓ, ఏఈఆర్ఓలను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా వివిధ అంశాలపై ఈఆర్ఓలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డి.మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ తుది ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా పారదర్శక ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఈఆర్ఓ, ఏఈఆర్ఓలను ఆదేశించారు. పాపులేషన్ రేషియో, జెండర్ రేషియో, రాజకీయ పార్టీల ఫిర్యాదులు తదితర అంశాలపై రోల్ అబ్జర్వర్ ఆరా తీశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు అందించిన ఫిర్యాదులు పరిష్కరించారా, ఫిర్యాదులను విచారణ చేసి నిజమైనవని తేలితే తుది ఓటర్ల జాబితాలో తొలగించారా లేదా అన్న అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫేక్ వ్యక్తులు, ఇతరుల ఆధార్ నెంబర్‌తో ఓటర్ సవరణలపై ఫిర్యాదులు వచ్చినట్లయితే వారిని ఫోన్ నెంబర్, ఐడి ద్వారా గుర్తించి సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 2024 జనవరి నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరినీ నూతనంగా ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. భారత ఎన్నికల సంఘం సూచించిన షెడ్యూల్ ప్రకారం ఓటర్ల తుది జాబితాను ఈ నెల 22వ తేదీన బూత్ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ప్రచురణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లకు ఇబ్బంది కాకుండా ఒకే లొకేషన్‌లో నాలుగుకు మించి పోలింగ్ స్టేషన్లు లేకుండా చూసుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 25వ తేదీ జాతీయ ఓట్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గతంలో రెండు పర్యాయాలు జిల్లాకు వచ్చి రోల్ జాబితాపై సూచించిన సలహాలను పరిగణనలోకి తీసుకొని తుది ఓటర్ల జాబితా రూపకల్పనకు సిద్ధం చేశామన్నారు. సమావేశంలో డిఆర్ఓ పుల్లయ్య, అన్ని నియోజకవర్గాల స్పెషల్ అధికారులు పాల్గొన్నారు.

శాశ్వత అభివృద్ధికి బాటలు : మంత్రి

ప్రజాశక్తి - ప్యాపిలి

డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా శాశ్వత అభివృద్ధికి బాటలు వేశామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు నెరవేరని హామీలు ఇవ్వడం కొత్త కాదని, వాగ్దానాలు ఎన్ని ఇచ్చినా అమలు చేయకపోవడం రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. ఆదివారం మండలంలోని హుసేనాపురం గ్రామంలో రూ.19 కోట్లతో నిర్మించిన షెపర్డ్ ట్రైనింగ్ సెంటర్, వెటర్నరీ పాలిటెక్నిక్ కాలేజీలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్యాపిలి పూర్తిగా వర్షం మీద ఆధారపడిన మండలమని, ఒక్క ఎకరా కూడా నీటిపారుదల లేదన్నారు. ప్యాపిలిలో పశు సంపదకు సంబంధించిన కళాశాల కట్టాలన్నది దశాబ్దం నాటి కల అని, వెటర్నరీ పాలిటెక్నికల్ కాలేజీ ద్వారా ఏడాదికి 60 మంది శిక్షణ పొంది, ఉపాధి పొందుతారని తెలిపారు. షెపర్డ్ ట్రైనింగ్ సెంటర్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులకు ఉపయోగకరమన్నారు. మూగజీవాలకు సంబంధించిన ఏ విషయాలైనా రెండు రోజుల్లో ఇక్కడ శిక్షణ ఇస్తారన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి బేతంచెర్ల, డోన్, ప్యాపిలి మండలాలకు రూ.351 కోట్ల వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుతో తాగునీరు త్వరలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, జిల్లా జెడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీరాములు, జడ్పిటిసి శ్రీరామరెడ్డి, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ పుల్లారెడ్డి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ పోదొడ్డి కృష్ణమూర్తి, మాజీ జడ్పిటిసి దిలీప్ చక్రవర్తి, మండల సచివాలయ కన్వీనర్ మల్లికార్జున రెడ్డి, సొసైటీ ఛైర్మన్ రాము, ఉప సర్పంచ్ భువనేశ్వర్ రెడ్డి, కృష్ణారెడ్డి, సీమ సుధాకర్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర వర్మ, ఎంపిడిఓ ఫజల్ రహిమాన్, రామిరెడ్డి, కాంట్రాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, మస్తాన్, ప్రభాకర్ రెడ్డి, నిజాం, శ్రీనివాసులు, అంజి, ప్రతాప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

మానవాళికి వేగుచుక్క లెనిన్

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల

సమ సమాజ నిర్మాణం కోసం తన జీవితాన్ని అంకితం చేసి ప్రపంచ మానవాళికి వేగు చుక్కలా లెనిన్ నిలిచారని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం నంద్యాలలోని సిపిఎం కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.నాగరాజులు లెనిన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రష్యాలో జార్ నిరంకుశ ప్రభుత్వాన్ని లెనిన్ కూల్చివేసి కార్మిక, కర్షక పార్టీని తీసుకువచ్చారని, భారతదేశంలో కూడా కార్మిక కర్షక మైత్రి ఉంటే ఎన్నో విజయాలు సాధించవచ్చని, కార్మిక కర్షక మైత్రి పెరగాలంటే మనమందరం కలిసికట్టుగా పని చేయాలని అన్నారు. 2018-2023 దాకా సిఐటియు ,ఆల్ ఇండియా కిసాన్ సభ, ఆలిండియా వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా దుర్మార్గమైన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఏడాది పాటు దేశ వ్యాప్తంగా జరిగిన పోరాటంలో ఈ మైత్రిని సాధించడం గొప్ప విషయమన్నారు. ఈ పోరాటానికి నాయకత్వం వహించిన సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంలో కార్మిక వర్గం నుండి అపారమైన మద్దతు అందుకుందని తెలిపారు. ఈ రెండు వర్గాలు కలిసి సంయుక్తంగా జరిగే పోరాటాలు 2024లో కూడా కొనసాగుతాయని, ఇప్పుడు అంగన్వాడి సమ్మె కూడా జరుగుతుందని, చాలా శక్తివంతమైన సమ్మె అని, మహిళలు అధికార పార్టీ బెదిరింపులకు భయపడకుండా చేస్తున్న సమ్మెకు రైతులు, ఇతర ప్రజా సంఘాలు కూడా మద్దతు తెలిపాయని చెప్పారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కార్పొరేట్, మతోన్మాద, నిరంకుశ ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి ప్రభుత్వాన్ని ఓడించడానికి మరింత విస్తృతమైన, తీవ్రమైన ఆందోళన రాజకీయ సిద్ధాంతిక నిర్మాణ పరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశంలో వామపక్ష ప్రజాతంత్ర శక్తులు అపారమైన కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు తోట మద్దులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి.లక్ష్మణ్, వెంకట లింగం, నాయకులు మాదాల శ్రీనివాసులు, శివ తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లులర్పిస్తున్న నాయకులు

భగత్ సింగ్ లైబ్రరీలో.. నంద్యాల పట్టణంలోని భగత్ సింగ్ లైబ్రరీలోని సమావేశ భవనంలో లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం లైబ్రరీ ఛైర్మెన్ బి. శంకరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పివి. ప్రసాద్, ప్రజా కళాకారుడు డి.చిన్న బాలహుస్సేన్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. సమావేశంలో వక్తలు హిస్టరీ లెక్చరర్ కృష్ణమూర్తి రాజు, సాహితీ స్రవంతి జిల్లా సహాయ కార్యదర్శి మాదాల శ్రీనివాసులు, అరసం జిల్లా అధ్యక్షులు ఎస్.ముర్తుజా, న్యాయవాది జివి. రమణ, ఉపాధ్యాయులు రఫీ మాట్లాడారు. అనంతరం ప్రజా కళాకారులు చిన్న బాల హుస్సేని, సుధాకర్, రమణ, రమేష్ ఆలపించిన కార్మిక విప్లవ గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రచయిత నీలకంఠమాచారి, సుబ్బయ్య, తోట పార్థసారథి, శ్రీనివాసులు హుస్సేని, చిన్నారావు, నారాయణ, భాస్కర్, మద్దిలేటి, బాల గౌడ్, రామచంద్ర మూర్తి, వెంకటేశ్వర్లు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ లైబ్రరీలో లెనిన్ చిత్రపటానికి నివాళ్లులర్పిస్తున్న నాయకులు

36 సంవత్సరాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని ఎద్దుల పాపమ్మ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వైభవంగా నిర్వహించారు. 1985-87లో ఇంటర్మీడియట్ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జ్ఞాన దేవమణి, ఎస్ఎండి రఫీ భాష, అబ్దుల్ మాలిక్, మల్లేశ్వర్, జనార్ధన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమ్మేళనంలో అధ్యాపకులు శంకర్ రెడ్డి, జానారత్నం, మునిస్వామి, వెంకయ్య సిద్ధారెడ్డి, సుబ్బారెడ్డి, రమణయ్య, మాదం రవి తదితరులను ఘనంగా సన్మానించారు. 1985-87లో ఇంటర్మీడియట్ బ్యాచ్ పూర్వ విద్యార్థులంతా 36 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తమకు విద్యాబుద్ధులు నేర్పి ఇంతటి ప్రయోజకులను చేసిన గురువులందరికీ పాదాభివందనాలు చేస్తూ జ్ఞాపికలు, శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించుకున్నారు. కార్యక్రమంలో వైపిపిఎం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గంగన్న, హరి ప్రసాద్ రెడ్డి, డేవిడ్, శేఖర్, ఫసివుల్లా ఖాద్రి, బాచేపల్లి గౌస్, రఫీ, భువనేశ్వరి, షాషావలి, రామలింగారెడ్డి, రామసుబ్బన్న తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో స్వచ్ఛ తీర్థ కార్యక్రమం

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైలంలో చేపట్టిన స్వచ్ఛ తీర్థ కార్యక్రమంలో భాగంగా ఆదివారం శిఖరేశ్వర ఆలయ పరిసరాల్లో పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ ప్రారంభించిన ఈ కార్యక్రమం 8 రోజులపాటు పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఒక్కొక్క ప్రాంతంలో కార్యక్రమాన్ని చేపట్టి శుభ్రం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రామకృష్ణ, మురళీధర్ రెడ్డి, ఏఈఓ మల్లికార్జున్ రెడ్డి, శ్రీశైలం ప్రభ ఎడిటర్ డాక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త ఊడుతున్న దృశ్యం

అనుమతి లేకుండా భూములు తీసుకోవద్దు

- ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేకర్

ప్రజాశక్తి - బనగానపల్లె

రైతుల అనుమతి లేకుండా పాతపాడు, మీరాపురం, ఫతేనగరం, కటికెవానికుంట గ్రామాలలో సోలార్ ప్రాజెక్టుకు భూములు తీసుకోవద్దని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని యాగంటి దేవస్థానం సమీపంలో గ్రీన్కో సోలార్ కంపెనీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు ,రైతులు రెండు పంటలు పండే భూములను సోలార్ కంపెనీకి ఇచ్చేందుకు సుముఖంగా లేరని, గ్రీన్ కో సోలార్ కంపెనీ వారు బలవంతపు భూసేకరణ చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ పాతపాడు. మీరాపురం గ్రామాలలో బోర్ల కింద రెండు, మూడు పంటలు పండే సారవంతమైన భూములలో గ్రీన్ కో కంపెనీ సోలార్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తుందని, ఈ భూములను రైతులు సోలార్ కంపెనీకి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని చెప్పారు. కంపెనీ వారు బలవంతపు భూసేకరణ చేయడానికి ప్రయత్నించవద్దని, రైతుల అనుమతితోనే తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, సిపిఎం మండల కార్యదర్శి జెవి సుబ్బయ్య, రైతు సంఘం నాయకులు ప్రసాదు, రైతులు బెడదల నారాయణరెడ్డి, రామేశ్వర రెడ్డి, అప్ప, విజయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

26న జిల్లా కేంద్రంలో ట్రాక్టర్ ర్యాలీ

- జయప్రదం చేయాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఈ నెల 26వ తేదీ రిపబ్లిక్ డే సందర్భంగా నంద్యాల జిల్లా కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ట్రాక్టర్స్ ర్యాలీని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, మండల అధ్యక్షుడు సీతారాంపురం జి.వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం జరిగిన రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో సుబ్బరాయుడు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంపై కొనసాగుతున్న రైతు కార్మిక సంఘాల పోరాటం కొనసాగింపులో భాగంగా ఈ నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా నంద్యాల జిల్లా కేంద్రంలో ట్రాక్టర్, టు వీలర్ ర్యాలీని చేపడుతున్నట్లు చెప్పారు. కరువు, తుఫాన్‌ల వల్ల 2023 ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు కరువు నష్టపరిహారం, 2023 డిసెంబర్ మొదటి వారంలో వచ్చిన తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని, ఫిబ్రవరి 5, 6 తేదీలలో నంద్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో ధర్నాలు చేసి తహసీల్దార్‌లకు వినతి పత్రాలు ఇవ్వాలని తెలిపారు. ప్రత్యేకించి రాష్ట్రంలో లక్ష మందికి పైగా ఉన్న అంగన్వాడీ కార్మికులు చేస్తున్న సమ్మెకు రైతు సంఘం, అన్ని సంఘాలను కలుపుకొని, గ్రామీణ ప్రాంతంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు సంఘీభావంగా నిలవాలన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి పి.రామమోహన్, సహాయ కార్యదర్శి టి.పద్మావతి, గౌరవాధ్యక్షులు నీలి వెంకట కృష్ణారెడ్డి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

టిడిపి పాలనలో నాయకుల ఇండ్ల వద్దనే ప్రభుత్వ పాలన జరిగేదని, వైసిపి పాలనలో ప్రజల వద్దకే పాలన సాగుతుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో కార్పెంటర్స్ అసోసియేషన్ కాలనీని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి , వైసిపి నియోజకవర్గ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. టిడిపి హయాంలో బీసీలకు ఒక్కరికైనా పెద్దల సభకు పంపించిన ఘనత ఉందా అని ప్రశ్నించారు. టిడిపి పాలనలో మైనారిటీ శాఖకు మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తిని మంత్రిని చెయ్యలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. 2024 ఎన్నికల్లో బిసికి ప్రజలే బుద్ధి చెప్పడానికి ఎదురు చూస్తున్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో అఖండ మెజార్టీతో ముఖ్య మంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, కార్పెంటర్ యూనియన్ గౌరవాధ్యక్షులు అబ్దుల్ ఫైజ్, డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ హుస్సేన్, అధ్యక్షులు మాలి నబి రసూల్, సెక్రటరీ మహమ్మద్ హుస్సేన్, గౌరవ సలహాదారులు ఖాదర్ బాషా, ట్రెజరర్ షాబులు, సభ్యులు కమ్మరి ఉమామహేశ్వర ఆచారి, మహబూబ్ బాషా, ఎంపీపీ మానసవీణ, పట్టణ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, గ్రామపంచాయతీ ఈవో ఖలీల్, వైసిపి మండల కన్వీనర్ పసుపల సన్నల జనార్దన్ రెడ్డి, తమ్మడపల్లె ,కొత్తపేట సర్పంచులు వెంకట్రామిరెడ్డి, రమణ, నాయకులు సైకిల్ షాప్ మహబూబ్ వలి, పెద్దన్న, మండల కో ఆప్షన్ నెంబర్ అనిల్, వార్డు మెంబర్ సూరి, ఎంపీటీసీ పోలూరు వెంకటసుబ్బయ్య, ఎర్రగుడి రామసుబ్బారెడ్డి, ఈశ్వర్ నాయక్, కార్పెంటర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిసిఎస్ ఇన్స్పెక్టర్

సిసిఎస్ ఇన్‌స్పెక్టర్‌గా మంజునాథ్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల సీసీఎస్ పోలీసు ఇన్స్పెక్టర్‌గా ఎం.మంజునాథ్ రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ కె . రఘువీర్ రెడ్డిని జిల్లా పోలీస్ కార్యాలయంలో పుష్పగుచ్ఛంతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎం.మంజునాథ్ రెడ్డి సాధారణ బదిలీలో భాగంగా కడప జిల్లా జమ్ములమడుగు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

నేడు పోలీసు స్పందన తాత్కాలిక రద్దు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : జిల్లా పోలీసు కార్యాలయంలో నేడు సోమవారం జరిగే పోలీసు స్పందన కార్యక్రమాన్ని కొన్ని అనివార్య కారణాల వల్ల తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున అర్జీదారులు సుదూర ప్రాంతాల నుండి వ్యయ, ప్రయాసలతో జిల్లా పోలీసు కార్యాలయం వద్దకు రావొద్దని, జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే సోమవారం పోలీసు స్పందన కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

30 నుండి 'జయహో బిసి'

- జయప్రదం చేయండి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్ : శ్రీశైలం నియోజవర్గంలో ఈ నెల 30వ తేదీ నుండి జరగనున్న జయహో బిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కోరారు. ఆదివారం ఆత్మకూరులో శ్రీశైలం, సున్నిపెంట, ఆత్మకూర్, వెలుగోడు, బండి ఆత్మకూరు, మహానంది మండలాల బిసి నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిలకు టిడిపి ఆవిర్భావం నుండి ప్రజా ప్రతినిధులుగా అవకాశం ఇవ్వడంతో పాటు వారి అభివృద్ధికి ఎంతో కృషి చేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత బీసీలను విడదీసి కార్పొరేషన్లుగా ఏర్పాటు చేయడమే తప్ప వారి అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. ఈ విషయాలను నియోజవర్గ ప్రజలు తెలియజేసేందుకు ఈ నెల 30వ తేదీ నుండి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో చేపట్టే జయహో బిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బిసి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

మాట్లాడుతున్న నాయకులు

మాలలకు అన్ని పార్టీలు టికెట్లు ఇవ్వాల్సిందే

- మాలమహానాడు డిమాండ్

ప్రజాశక్తి - కొత్తపల్లి : ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎస్‌సి రిజర్వుడు స్థానాలైన కోడుమూరు, నందికొట్కూరు నియోజకవర్గాలలో ఏదో ఒక స్థానంలో ప్రతి పార్టీ మాలలకు టికెట్ కేటాయించాలని మాల మహానాడు రాష్ట్ర నాయకులు మల్లె ఎలీషా, ప్రాతకోట రమేష్, జై భీమ్ జై భారత్ వ్యవస్థాపకులు పెరుమాళ్ళ చెన్న కేశవులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు కొత్తపల్లిలో విలేకరులతో మాట్లాడారు. నియోకవర్గంలో స్థానికులుగా ఉండి విద్యావంతుడు, సమర్థుడు, రాజకీయ అవగాహన, సామాజిక స్పృహ కలిగిన స్థానికుడికి టికెట్ ఇవ్వడం వల్ల గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఏ పార్టీ అయినా మాలలకు టికెట్ కేటాయించకపోతే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు నియోజకవర్గాలలో ఆపార్టీ ఓటమికి మాలలు కృషి చేస్తారన్నారు. మాలలు ప్రతి పార్టీలో ఉన్నారని, విస్మరిస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఇప్పటికే వైసిపి కోడుమూరులో మాదిగలకు, నందికొట్కూరులో మాలలకు కేటాయించిందని, టిడిపి కూడా ఏదో ఒక చోట మాలలకు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మల్లన్న సన్నిధిలో తెలంగాణ మంత్రి

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను ఆదివారం తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజ నరసింహ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మంత్రి కుటుంబ సమేతంగా ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగానే దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పెద్దిరాజు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత ముందుగా స్వామివారిని, అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వేద ఆశీర్వచనం మండపంలో వీరికి వేదపండితులు ఆశీర్వచనం పలికారు. శేష వస్త్రాలను, ప్రసాదాలను, జ్ఞాపికను ఇఒ అందజేశారు.

షాపులలో తూనికల అధికారులు తనిఖీ

ప్రజాశక్తి - మిడుతూరు : మిడుతూరు మండలంలోని ఆయా షాపులలో తూనికల విభాగానికి చెందిన ఇన్స్పెక్టర్ అనిత, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు ఆదివారం ఎలక్ట్రానిక్ కాటాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షాపులలో ఏవైనా వస్తువులు అమ్మేటప్పుడు అవి ఎక్కడ తయారయ్యాయని, మ్యానుఫ్యాక్చర్ ముద్ర అడ్రస్ ఉంటేనే వాటిని అమ్మాలని లేకపోతే అడ్రస్ లేని నాసిరకమైన వస్తువులు అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

స్పాట్ పెయింటింగ్‌లో దేశెట్టి శ్రీనివాసులు ప్రతిభ

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు లైన్స్ క్లబ్ హాల్ నందు ఆదివారం బాపు ఆర్ట్ అకాడమీ 8వ వార్షికోత్సవం సందర్భంగా స్పాట్ పెయింటింగ్‌ను నిర్వహించారు. ఇందులో సీతాకోకచిలుక పెయింటింగ్ వేసి ప్రతిభ కనబరిచిన దేశెట్టి శ్రీనివాసులకు ప్రశంసా పత్రం, జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, నిర్వాహకులు రామకష్ణ భాస్కర్ రావు, రాము తదితరులు ప్రముఖ సీనియర్ చిత్రకారులు దేసెట్టీ శ్రీనివాసులను అభినందించారు.

రానున్న ఎన్నికల్లో విజయం తథ్యం : కాంగ్రెస్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ ఆళ్లగడ్డ మండల అధ్యక్షులు, సమన్వయకర్త బరగొడ్ల హుస్సేన్ భాష అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిసిసి, డిసిసి పిలుపుమేరకు విజయవాడ ఆహ్వాన కళ్యాణ మండపంలో వైయస్ షర్మిల రెడ్డి పదవీ బాధ్యతల స్వీకరణ మహెూత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హుస్సేన్ బాషా మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఉన్న రైతులకు మూడు లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.500కు గ్యాస్ సిలిండర్ బండ, పోలవరం ప్రాజెక్టు, విశాఖపట్నం ఉక్కు స్టీల్ ప్లాంట్, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తుందన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన, దేశంలో దుర్మార్గం పాలన జరుగుతుందని బిజెపి, వైసిపి పార్టీని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో, దేశంలో అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందన్నారు. కాబట్టి ప్రజలు ఒక్కసారి ఆలోచన చేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిరివెళ్ల మండల అధ్యక్షుడు పసుపులేటి లక్ష్మీ నరసింహుడు, జిల్లా సెక్రెటరీ మహబూబ్ భాషా, రియాజ్, రఫిక్, సురేష్, చందు, శేఖర్, సంజీవ, నాగయ్యా తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఆళ్లగడ్డ నాయకులు

అంగన్‌వాడీలు అరెస్టు

5వ పేజీ తరువాయి.. రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందే తప్ప సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించమంటే సిఎం జగన్మోహన్ రెడ్డి అంగన్‌వాడీలు ఎక్కడికక్కడ మావోయిస్టులు, ఉగ్రవాదులైనట్టుగా అరెస్టు చేయించడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల కంటే ముందు అక్కా చెల్లెమ్మలకు ముద్దులు పెట్టి నోటికాడి ముద్ద లాగేసిన జగన్ మోహన్ రెడ్డికి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పకుండా చెబుతామన్నారు. ఈ విషయాన్ని వైసిపి నాయకులు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఏదేమైనా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకు వెనుకడుగు వేసే ప్రసక్తి లేదన్నారు. అవసరమైతే మండల కేంద్రాల్లో కూడా ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామని, అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. **నందికొట్కూరు టౌన్ :** గత 40 రోజుల నుండి సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతుగా రాష్ట్ర కేంద్రంలో చేపట్టిన దీక్షలకు వెళ్లకుండా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణను ఆదివారం నందికొట్కూరు సిఐ ప్రకాష్ కుమార్ అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

41వ రోజూ అంగన్వాడీల నిరవధిక సమ్మె

ఆత్మకూర్ : పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు 41వ రోజు సమ్మె కొనసాగించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ అధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి మంజుల, కోశాధికారి లక్ష్మీదేవిలు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అంగన్వాడీలు రవణమ్మ, శివ నాగమ్మ, ప్రమీలమ్మ, లక్ష్మీదేవి, చెన్నమ్మ, సుజాత, భారతి, ఖాదర్ బి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు. **మహానంది :** మహానందిలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడి కార్యకర్తల సమ్మె కొఒనసాగింది. అంగన్వాడీ కార్యకర్తలు సావిత్రి, లక్ష్మీ నారాయణమ్మ, జ్యోతి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** జూపాడు బంగ్లా తాసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకురాలు ప్రసన్న వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం కర్ణ, సిఐటియు నాయకులు పద్మావతి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్ర సందర్భంగా అంగన్వాడీలకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో అంగన్‌వాడీల సమ్మె

మహానందిలో..

జూపాడుబంగ్లాలో...

మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరి

జనసేన మా మిత్రపక్షమే

- పొత్తుల విషయం అధిష్టానం చూసుకుంటుంది
- బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టర్

రాబోయే ఎన్నికల్లో బిజెపి ఎపిలో బలమైన శక్తిగా ఎదుగుతుందని, జనసేన తమ మిత్రపక్షమని, పొత్తుల విషయం అధిష్టానం చూసుకుంటుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరి అన్నారు. ఆదివారం నంద్యాలలోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో జరిగిన శక్తి కేంద్ర ప్రముఖులు, బూత్ అధ్యక్షుల సమావేశానికి విచ్చేసిన ఆమె మీడియాతో మాట్లాడారు. వికసిత్ భారత్ పేరుతో బిజెపి ప్రజల్లోకి వెళ్లి నరేంద్ర మోడీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక చేపట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి బిజెపి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ నెల 22న అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ బ్రహ్మాండంగా జరుగుతుందని, అందుకు సంబంధించి ఏపీలో ప్రభుత్వం సెలవు ప్రకటించలేదని, తక్షణమే సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దొంగ ఓట్ల సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు రాష్ట్ర ఎంపీలతో కలిసి ఫిర్యాదు చేశామన్నారు. సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి, నియోజకవర్గ ఇన్చార్జి అభిరుచి మధు, నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, డోన్, బనగానపల్లె, ఆళ్లగడ్డ, పాణ్యం నియోజకవర్గాల ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి పండు జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయులు కోటయ్య ఆదివారం తెలిపారు. పీడి దాదా పీర్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి గత నెల 19 నుంచి 21వ తేదీ వరకు నంద్యాల జిల్లా మిడుతూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బేస్ బాల్ అండర్ 14 బాలుర విభాగంలో జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడని తెలిపారు. ఈ నెల 28 నుంచి 31వరకు ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రంలోని కొర్బాలో జరగబోయే జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14 బాలుర బేస్ బాల్ పోటీలలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని చెప్పారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని పాఠశాల హెచ్ఎం కోటయ్య, ఇన్చార్జి హెచ్ఎం మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు, పిఇటి భారతిలు అభినందించారు.

జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థితో హెచ్ఎం,ఉపాధ్యాయులు

ఘనంగా వెంకీ డిజిటల్స్ ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల : వెంకీ ఆర్ట్స్ నిర్వాహకులు దండు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెంకీ డిజిటల్స్ ప్రింటింగ్ షాప్‌ను మాధవరెడ్డి సేవాసమితి అధ్యక్షులు మాధవరెడ్డి, అడిషనల్ ఎస్పీ చంద్రబాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దండు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీనివాస్ సెంటర్ సమీపంలో సౌజన్య కాంప్లెక్స్ పైఅంతస్తులో ఫ్లెక్స్ బ్యానర్స్ ప్రింటింగ్ మిషన్ ప్రారంభించామని, సరసమైన ధరలకు ఫ్లెక్స్ బ్యానర్లు ముద్రిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ సొసైటీ గౌరవాధ్యక్షులు శ్రీనిధి రఘువీర్, రోటరీ విద్యాసంస్థల అధినేత డివి సుబ్బయ్య, మహానంది మండల విద్యాధికారి రామసుబ్బయ్య, గ్రీన్ సభ్యులు పోసా శ్రీనివాసులు, సంతోష్, నారాయణ, రామసుబ్బయ్య ,అన్నెం శ్రీనివాసరెడ్డి, డా.కిషోర్, రామకృష్ణ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్స్ ప్రారం భిస్తున్న ముఖ్య అతిథులు

అంగన్వాడీల సమ్మెను సామరస్యంగా పరిష్కరించాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

ప్రజాశక్తి - ఆత్మకూర్

అంగన్వాడీల సమ్మెను ప్రభుత్వం సామరస్యంగా పరిష్కరించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ ఏ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో అంగన్వాడీల సమ్మెను విరమింపజేయాలని, ఎస్మా వద్దు, జీతాలు పెంచాలి, జీవో నెంబర్ 2ను రద్దు చేయాలని కోరుతూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసు రత్నం, జనసేన నాయకులు శ్రీరాములు, బహుజన సమాజ్ వాది పార్టీ నాయకులు చంద్రశేఖర్‌లు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 41 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం రాకపోవడంతో సమ్మెను ఉదతం చేస్తూ నాలుగు రోజుల నుండి అంగన్వాడి రాష్ట్ర నాయకత్వం ప్రాణాలకు తెగించి విజయవాడ నడిబొడ్డులో ఆమరణ నిరాహార దీక్షలు చేస్తున్నారని తెలిపారు. వారికి ఏదైనా జరిగితే ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. శాంతియుత ఆందోళన సమ్మె చేస్తున్న అంగన్వాడీలను బెదిరింపులకు పాల్పడి తొలగించాలని చుస్తే తాటాకు చప్పులకు భయపడే కార్మికులు కాదన్నారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి నరసింహ నాయక్, స్వామన్న, టి.వెంకటేశ్వరావు, నాయకులు ఎం.రజాక్ పి.సుధాకర్, డి.రామ్ నాయక్, ఏ.సురేంద్ర, సి.వెంకటేశ్వర్లు, షైక్ ఇస్మాయిల్, పాల శివుడు,వీరన్న, గణపతి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వి.యేసురత్నం

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్ రెడ్డి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

గడిచిన ఐదేళ్లలో ఈ సైకో జగన్ రెడ్డి రాష్ట్రాన్ని పూర్తిగా భ్రష్టుపట్టించారని, రాష్ట్రంలో ఆదాయం పెరగలేదని, ఉద్యోగాల కల్పన జరగలేదని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కనకాద్రిపల్లెపల్లె, రాఘవరాజు పల్లె గ్రామాలలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ ప్రజావేదిక కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున్రెడ్డి, మండల అధ్యక్షుడు ఎం రామేశ్వర్ రెడ్డి, నంద్యాల రమేష్ రెడ్డి, హుస్సేనయ్య, పెట్టికోట సత్య రెడ్డి, హుస్సేన్ రెడ్డి, శివరామిరెడ్డి, రఘురామిరెడ్డి, లక్ష్మిరెడ్డి, సర్పంచ్ శివశంకర్, ఓబులేషు, ఉప సర్పంచ్ రామలక్ష్మణ్, అంబటి సాయి రెడ్డి, ఎంపిటిసి పెద్దన్న, నల్లరామిరెడ్డి, పెద్దిరెడ్డి చిన్న రామిరెడ్డి, శేఖర్, రాఘవ రాజు పల్లె నాయకులు సాయి రెడ్డి, రామకృష్ణ రెడ్డి, సర్వేష్ రెడ్డి, విజయసింహరెడ్డి, శేఖర్, రామలింగం, రామయ్య, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నుండి టిడిపిలోకి 65 కుటుంబాలు : కొలిమిగుండ్ల మాజీ సర్పంచి సీతా రామయ్య, తలారి రమణల ఆధ్వర్యంలో వైసిపికి చెందిన 65 కుటుంబాలు కొల్లిమిగుండ్లలోని టిడిపి మండల కార్యాలయంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా టిడిపిలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

మాజీ ఎమ్మెల్యే బిసికి పూలమాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

చౌడయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

చౌడయ్య కుటుంబానికి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - పాములపాడు

వైసిపి మండల మాజీ కన్వీనర్ చౌడయ్య చిన్న కుమారుడు నాగరాజు శుక్రవారం గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆదివారం సాయంత్రం చౌడయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్న వయసులో ఇలా జరగడం బాధాకరమన్నారు. ధైర్యంగా ఉండాలని చౌడయ్యను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు రామలింగేశ్వర రెడ్డి, ఉపాధ్యక్షులు రమణారెడ్డి, జెఎసి కన్వీనర్ టి.నాగరాజు, మద్దూరు సింగిల్ విండో సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మిట్టకందాల సర్పంచ్ చింతల నారాయణ, తుమ్మలూరు సర్పంచ్ వరప్రసాద్, సొసైటీ డైరెక్టర్ గోపాలు, బాల సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు మహానంది రెడ్డి, బాలు నాయక్, బాలీశ్వర్ రెడ్డి, జబ్బారు, బంగారం భాష, ప్రభాకర్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బాబుతోనే యువతకు భవిష్యత్తు : టిడిపి

ప్రజాశక్తి - నంద్యాలకలెక్టరేట్

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుతోనే యువతకు భవిష్యత్తు ఉంటుందని మాజీ మంత్రి, నంద్యాల ఇంచార్జ్ ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలోని 8వ వార్డు ఉప్పరిపేట ఇంచార్జ్ ఉప్పరి సురేష్, ఉప్పరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద ఎత్తున యువకులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. దాదాపు 100 మంది యువకులకు ఎన్ఎండి ఫరూక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్‌లు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ టిడిపితోనే యువత భవిష్యత్తు ముడిపడి ఉందని, ఐటి సెక్టార్‌తో పాటు వేల కంపెనీలు రాష్ట్రానికి తెచ్చి లక్షల ఉద్యోగాల రూపకల్పన చేసి యువకుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత చంద్రబాబుదేదన్నారు. ఇప్పటికైనా యువకులు గ్రహించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకుంటే మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సుభాని, ఆరిఫ్, ప్రసాద్, షమీర్, సిద్ధు, షబ్బీర్ వారి మిత్రబృందం ఇలియాస్, కళ్యాణ్ బాబు, సుధాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎండి ఫరూక్ సమక్షంలో టిడిపిలో చేరిన యువకులు

మహారాజశ్రీ ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. No. 7/2023 in O.S. 190/2021
గొల్ల బొజ్జమ్మ .... అర్జీదారు/డి.హెచ్ఆర్
V/s.
జండాల షేక్ రసూల్ (died) by his LRs
1) జండాల షేక్ మాబున్నీ, W/o. J.S. రసూల్
2) జండాల షేక్ నన్నేసాహేబ్, S/o. J.S. రసూల్
3) జండాల షేక్ నూర్జహ, D/o. J.S. రసూల్
4) జండాల షేక్ ఆషా, D/o. J.S. రసూల్
5) జండాల షేక్ వాహీదా, D/o. J.S. రసూల్
6) జండాల షేక్ హాషీనా, D/o. J.S. రసూల్
All are R/o. H.No. 5-29, ముస్లిమ్స్, ఎర్రమఠం గ్రామము, కొత్తపల్లి (మం), నంద్యాల(జిల్లా)
.... రెస్పాండెంట్స్/జె.డి.ఆర్స్
రెస్పాండెంట్స్/జె.డి.ఆర్స్‌కు
U/O 21 Rule 66 C.P.C. నోటీసు
పై నెంబరు E.P. లో అర్జీదారు తనకు రావలసిన డిక్రీ సొమ్మును రాబట్టుకొనుటకు E.P Schedule ఆస్తులను వేలం వేసి వసూలు చేసుకొనుటకు అర్జీదాఖలు చేసినాడు. పై కోర్టు వారు పలుమార్లు నోటీసులు పంపిన కూడ మీకు చేరనందున, ఈ పత్రిక ద్వారా మీకు తెలియజేయడం ఏమనగా 16-02-2024 తేదీన వేలం షరతులు నిర్ణయించుటకు ఏర్పరిచినాము. కనుక మీరు 16-02-2024 తేదీన స్వయంగా కాని లేక మీ తరపున న్యాయవాది గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు ఎదుట తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున పై అమలు అర్జీని తీర్మానించబడును.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా : 16-02-2024
ఇట్లు
వేముల వెంకటేశ్వర్లు
అర్జీదారు/డి.హెచ్.ఆర్. న్యాయవాది
ఆత్మకూరు,
నంద్యాల జిల్లా.

మహారాజశ్రీ నంద్యాల జిల్లా ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెంబర్: 215/2023
పాలమర్రి నాగన్న. ...వాది
వర్సెస్
మొల్ల నసీబ్ హుస్సేన్. ...ప్రతివాది
ప్రతివాది
మొల్ల నసీబ్ హుస్సేన్ తండ్రి మొల్ల మహమ్మద్ హనీఫ్ ఎలక్ట్రీషన్, వయసు 34 సం॥రాలు, ఇస్కాల గ్రామము, ఇంటి నెంబర్ 1-86, బస్టాండ్ రోడ్డు, ఇస్కాల గ్రామము, పాములపాడు మండలము, నంద్యాల జిల్లా.
ప్రతివాదికి దావా సమన్లు
వాది, ప్రతివాది అయిన మీపై దావా వేసి ఉన్నారు. పై కేసు మీ హాజరు కొరకు 02/02/2024వ తేదీ వాయిదా ఉన్నది. కావున ఆ వాయిదా దినము 10:30 గంటలకు పై కోర్టులో నీవు ప్రత్యక్షముగా గాని వకీలు ద్వారా గాని హాజరై నీవు పై దావాకు సంబంధించి నీకు ఎటువంటి అభ్యంతరములు ఉన్నను తెలుపుకొనవచ్చును. లేనియెడల పై కేసు విషయము నీ పరోక్షమున పై కోర్టు వారు తీర్మానించెదరు.
పై కోర్టు వారి ఉత్తర్వులు మేరకు
వాయిదా: 02/02/2024
అడ్రసు
M/s. అడ్మిరల్ లా అసోసియేట్స్
వై.రణదీప్ కుమార్ రెడ్డి,
(AP1707/2012)
జి.భరత్ కుమార్
(AP913/2022)
కర్నూలు.
సెల్ నెంబర్ : 8886762519

మహారాజ శ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: నంద్యాల
I A.No.895/2021 IN O.S. NO.533/2021
దూదేకుల శివశంకర్ బాబు ....వాది/ పిటిషనర్
వర్సెస్
V. సంధ్యారాణి Died by Lr's
1) V. రఘుపతి S/o. రఘుపతిరావు, H.No. 25-450-2B-139, YSR నగర్, నంద్యాల టౌన్, & మండలము మరియు జిల్లా.
3. V. నాగేంద్రనాథ్ 3rd ప్రతివాది మైనర్ Rep. by its natural Garden father i.e. 1st ప్రతివాది
.... ప్రతివాదులు
ప్రతివాదికి దావా సమన్లు
పై దావా నందు వాది, ప్రతివాది పై దావా దాఖలు చేసి ఉండి. దావా మొత్తం డబ్బులు రాగోరి ఇంటిపై అటాచ్మెంట్ అయి ఉండి. దావా మొత్తం అసలు వడ్డీ కలిపి, 4,97,866/- రూపాయలు మొత్తం రాగోరి. ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తేదీ: 8-2-2024 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరపు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియజే యడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేదీ. 8-2-2024
ఇట్లు
దాసరి చిన్న లింగమయ్య
వాది పరం అడ్వకేట్ నంద్యాల

మహారాజశ్రీ గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: కోవెలకుంట్ల
O.S. NO.230/2021
షేక్ మహమ్మద్ సాహెబ్, తండ్రి లేట్ అబ్దుల్లా, R/o. పేరుసోమల గ్రామం, సంజామల మండలం నంద్యాల జిల్లా ....వాది
వర్సెస్
దూదేకుల వ్రణ వైద్యం రణధీర్ బాబు & ఇతరులు
.... ప్రతివాదులు
1.వ. ప్రతివాది అడ్రస్ :
దూదేకుల వర్ణ వైద్యం రణధీర్ బాబు, తండ్రి రమేష్ బాబు, పేరు సోముల గ్రామం, సంజామల మండలం, నంద్యాల జిల్లా.
1వ. ప్రతివాదికి దావా సమన్లు
పై దావా నందు వాది, ప్రతివాదుల పై దావా దాఖలు చేసి ఉండి. పై దావాలో 1. వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తేదీ.13-2-2024 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరపు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేదీ. 13-2-2024
ఇట్లు
ఎన్.కె. మహమ్మద్ అలీ
టీ.ఆర్. రాఘవరెడ్డి
వాది పరం అడ్వకేట్స్
నంద్యాల జిల్లా.

మహారాజశ్రీ గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: కోవెలకుంట్ల
O.S. NO.231/2021
షేక్ సుభాన్ తండ్రి లేట్ అబ్దుల్లా R/o, సిమెంట్ నగర్ గ్రామం, బేతంచెర్ల మండలం, నంద్యాల జిల్లా.
.... వాది
వర్సెస్
దూదేకుల వ్రణ వైద్యం రణధీర్ బాబు & ఇతరులు,
.... ప్రతివాదులు
1వ. ప్రతివాది అడ్రస్ :
దూదేకుల వర్ణ వైద్యం రణధీర్ బాబు, తండ్రి రమేష్ బాబు, పేరు సోముల గ్రామం, సంజామల మండలం, నంద్యాల జిల్లా
1వ. ప్రతివాదికి దావా సమన్లు
పై దావా నందు వాది , ప్రతివాదుల పై దావా దాఖలు చేసి ఉండి. పై దావాలో 1. వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తేదీ.13-2-2024 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరపు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేదీ. 13-2-2024
ఇట్లు
ఎన్.కె. మహమ్మద్ అలీ
టీ.ఆర్. రాఘవరెడ్డి
వాది పరం అడ్వకేట్స్
నంద్యాల జిల్లా.

మహారాజశ్రీ గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: కోవెలకుంట్ల
O.S. NO.164/2021
షేక్ ఖాదర్ బాషా (సాహెబ్) @ వనములో సాయిబు, తండ్రి లేట్ అబ్దుల్లా R/o, పేరు సోమల గ్రామం, సంజామల మండలం నంద్యాల జిల్లా. ....వాది
వర్సెస్
దూదేకుల వ్రణ వైద్యం రణధీర్ బాబు & ఇతరులు,
.... ప్రతివాదులు
1వ. ప్రతివాది అడ్రస్ :
దూదేకుల వర్ణ వైద్యం రణధీర్ బాబు, తండ్రి రమేష్ బాబు, పేరు సోముల గ్రామం, సంజామల మండలం, నంద్యాల జిల్లా
1వ. ప్రతివాదికి దావా సమన్లు
పై దావా నందు వాది, ప్రతివాదుల పై దావా దాఖలు చేసి ఉండి. పై దావాలో 1. వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తేదీ.13-2-2024 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరపు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేదీ. 13-2-2024
ఇట్లు
ఎన్.కె. మహమ్మద్ అలీ
టీ.ఆర్. రాఘవరెడ్డి
వాది పరం అడ్వకేట్స్
నంద్యాల జిల్లా.

మహారాజ శ్రీ గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: కోవెలకుంట్ల
O.S. NO.163 /2021
కట్టుబడి హుస్సేన్‌బీ భర్త గైబ్ సాబ్, R/o. అయ్యవారి కంబాలదిన్నె గ్రామం, మైలవరం మండలం, వై.ఎస్.ఆర్. కడప జిల్లా .....వాది
వర్సెస్
దూదేకుల వ్రణ వైద్యం రణధీర్ బాబు & ఇతరులు,
.... ప్రతివాదులు
1.వ. ప్రతివాది అడ్రస్ :
దూదేకుల వర్ణ వైద్యం రణధీర్ బాబు, తండ్రి రమేష్ బాబు, పేరు సోముల గ్రామం, సంజామల మండలం, నంద్యాల జిల్లా
1వ. ప్రతివాదికి దావా సమన్లు
పై దావా నందు వాది , ప్రతివాదుల పై దావా దాఖలు చేసి ఉండి. పై దావాలో 1. వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తేదీ.13-2-2024 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరపు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేదీ. 13-2-2024
ఇట్లు
ఎన్.కె. మహమ్మద్ అలీ
టీ.ఆర్. రాఘవరెడ్డి
వాది పరం అడ్వకేట్స్
నంద్యాల జిల్లా.